


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**80**

**(11 ' నవంబర్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**"దయవుంచి** నీ ఉపన్యాసం కొంచెం బంద్ చేస్తావా? లేదా? అర్ధరాత్రివేళ అదిరిపోతోంది కొంప. బెదిరిపోతున్నారు పిల్లలు." అని ఒక గృహస్థు భార్యను హెచ్చరించాడు.

"నా నోరు బంద్ చేసుకోనా! నన్ను అదమాయిస్తున్నారా! కామందులు గనుక మీకన్ని దమ్ములున్నాయి అలా అనడానికి. పడే బాధ పైకి చెప్పుకునే అవకాశం కూడా లేదన్న మాట ఆడవాళ్ళకు. బంద్ అట బంద్. నా నోరు బంద్ చేస్తే నాలుగు పూటలు సాగదీ సంసారం" అని ఆవిడగారు బిగించని తీగలమీద వగల రాగాలు సవరించింది.

*పలుకే బందా? నవ్వే బందా...*

బంద్ అనేమాట అప్పుడప్పుడూ ఇలాంటి సంభాషణల్లో వినిపిస్తూ వుండేది పూర్వం. మా మిత్రుడొకడు "పలుకే బంగారమాయెనా?" అన్న మాదిరిలో -

"పలుకే బందాయెనా!
పిలిచినా పలకవు!
చిందే బందాయెనా
త్రోసినా కదలవు..
నవ్వే బందాయెనా
గిలిగింతలే కులకవు!."

అంటూ ఒక పాట వ్రాసి రోడ్డుమీద ఆడపిల్ల కనపడ్డప్పుడల్లా పాడుతూ వుండేవాడు. మరో దురదృష్టపు ప్రియుడు ప్రియురాలి కొంప చుట్టూ తిరిగి తిరిగి

"తలుపులు బందూ
వలపులు బందూ!
వో సుందరి నిన్నేమందు.
నీ అందమె మరి నా మందు
వో సుందరి నిన్నేమందు
హృదయం బందు
వదనం బందు.

మరి చేయక నాకిక విందు.

నిద్రలోన, నడకలోన

నిన్నే తలుచుచు నుందు.

వో సుందరి నిన్నేమందు.

ఎందుకు మనకీ బందు?

చేయవ నాకిక విందు.

నిలువ నీదు నన్ను

వలపుల కామందు.

నీ అందమె మరి నా మందు

వో సుందరి నిన్నేమందు

దయదలచి మాట విందూ "

పాటవ్రాసి, ఒక పక్షం రోజులు ఆవిడ యింటి గవాక్షమందు నిలబడి వచ్చినప్పుడల్లా ఒక చరణం పాడి వినిపించడం మొదలు పెట్టాడు.

***తన్ను ముందు - అదే వాడికి విందు.***

ఆవిడ విని విని విసుగెత్తిపోయి, చివరకు ఒకరోజు యింటి నౌకర్ని పిలిచి

"వాణ్ణి తన్ను ముందు

చూడకు వెనకా ముందు.

దెబ్బకు మరవాలి మన సందు.

అదే వాడికి తగిన విందు "

- అని పాడిందిట - నౌకరు పాటకు సరిపడ్డ యాక్షన్ చేసి చూపించాడుట. ఆ పూటతో ఆ ప్రేమికుడి ఆశలు బంద్ అయినాయట. కన్నీరు మాత్రం బంద్ కాక, చాలాకాలం కొట్టుకున్నాడుట.

'బంద్' అనేమాట ఇలా పాటల్లోకి ప్రవేశించి, తన ప్రాభవాన్ని, ప్రచారాన్ని చాలావరకు సాధించకలిగింది. మరో ప్రేమికుడు తను మాత్రం ప్రేమించిన జవరాలి యింటిచుట్టూ పిచ్చి చూపులు చూస్తూ అనేకమాట్లు తిరిగేవాడట. ఆ వాలకం చూచి ఏదో సవరాలు కట్టేవాడు కావన్ను. అట్లా గోడలవంకా, ఆడపిల్లల జడలవంకా చూస్తూ తిరుగుతాడు - అనుకునేవారుట అక్కడి వారంతా.

తిరిగి తిరిగి రూముకి రాగానే మిత్రులు అడిగేవారట. "ఏమిటి నేటి తమాషా?" అని. అతగాడు అప్పుడే నిరాశ చెందడమేమిటనుకునేవాడు కాబోలు - దర్జాగా నిలబడి "ఇప్పుడేం వుంటుంది తమాషా ప్రస్తుతం దర్వాజా బంద్. కొంచెం మనిషికి ఎక్కువ ఘోషా!" ముందుంది.

***<u>చూపులు బంద్! చుట్టరికాలు బంద్.</u>***

"అసలు నిషా?" అనేవాడుట. "దర్వాజా" హృదయానికి సంబంధించిందని అతని భావం. దాని ఘడియలెప్పుడో తకాలున ఊడిపోతాయని - అప్పుడు సునాయాసంగా ప్రవేశించవచ్చనీ పాపం అతని అభిలాష. బంద్ - హిందీనుంచి దిగుమతి అయినమాట. కానీ తెలుగులో బాగా అతుక్కుపోయింది. 'సంప్ బంద్ అయింది" - "రాకపోకలు బంద్ అయింది" - "చూపులు బంద్" - "చుట్టరికాలు బంద్" ఇత్యాది మాటలు తరుచు వాడబడుతూ వుంటాయి.

మొన్న ఒకావిడ ఊరు బయలుదేరుతూ భోషాణమంత పెద్ద పెట్టె వేసుకుని బయలుదేరింది. దాన్ని రిక్షాల్లో పెట్టడానికే ముగ్గురు మనుష్యులు కావలసి వచ్చారు - "ఎందుకే అంత పెట్టె వేసుకుని బయలుదేరావు? దిగేటప్పటికే ఏ బందో రావచ్చు. రైలు దగ్గరనుంచి ఇంటిదాకా ఎవరిచేత తోడు పట్టించుకుపోతావు?" అంటున్నాడు.

***<u>మా అన్నయ్య రైలు పెట్టే మోయిస్తాడు</u>***

ఆవిడ "బంద్"లూ వుండవు. ఏం వుండవు. మీరు ప్రతిదానికి భయపడతారు. ఇలా అయితే ప్రయాణం చేశామే. అంతగా 'బంద్' వుంటే స్టేషన్నుంచి మా అన్నయ్యకు ఫోను చేస్తాను. వాడిచేతిక్రింద చాలామంది వుంటారు. ఈ పెట్టేమిటి అవసరమైతే రైలుపెట్టే మోసుకుపోగలరు" అని రిక్షా తోలించుకుని చక్కాపోయింది.

"దీపావళికి మా అల్లుడూ, అమ్మాయి వద్దామని బయలుదేరారుట. అత్తగారు ఆరుమైళ్ళ పైకిలేచి "మీరలా వెళ్ళడానికి వీలులేదు. ఎటు చూచినా బందులు గదా. ఎట్టా చేరతారు వూరు. పండగ మీకు పట్టాల మీదే గడిచిపోతుందేమో. కావలిస్తే పదిరూపాయల టపాకాయలు కొని దాచుకుని, రైళ్ళు మళ్ళీ రివ్వున పోవడం ప్రారంభించిన తర్వాత వెళ్ళిరండి. అల్లుడూ, కూతురూ ఎప్పుడు వెడితే అప్పుడే పండగా" అని వారిని ఆపేసిందిట. "ఏం చెప్పమంటారు సోద్యం" అని ఒక గృహస్థు ఎంతో బాధతో చెప్పాడు.

ఈ రోజుల్లో ఎప్పుడనేది బంద్ అయిపోతుందో చెప్పడం చాలా కష్టంగా వుంది. "ఫలానా రోజుకు ఆ ఊరు వెడదామని వుంది. ఎక్కడా ఎలాటి బందులూ లేకపోతే" అనుకోవడం మామూలైపోయింది.

***<u>పట్టే పట్టే నీళ్ళు బంద్ - పుట్టే పుట్టే పిల్లలు బంద్</u>***

తినే, తినే హోటళ్ళు బంద్, తిరిగే తిరిగే బస్సులూ, రైళ్ళూ బంద్. చదివే చదివే స్కూళ్ళు బంద్.. అమ్మే అమ్మే అంగళ్ళు బంద్, వెలిగే వెలిగే దీపాలు బంద్. పట్టే పట్టే నీళ్ళు బంద్, పుట్టే పుట్టే పిల్లలు బంద్. అన్ని రంగాల్లో బందులే.

కరువురోజులు వచ్చి పడటం వల్ల మనుషుల్లో కనికరాలు బంద్ అయినాయి.

ఎవరికివారు సృష్టికర్తలమనుకోవడం వల్ల పెద్దరికాలు బంద్ అయినాయి. చాలామంది గుండెలు గులకరాళ్ళుగా మారిపోవడం వల్ల కృతజ్ఞతలు బొత్తిగా బంద్ అయిపోయాయి.

"ఈ బందులవల్ల కలిగేవన్ని ఇబ్బందులే. గాలి పీల్చేందుకు వీలులేదు, నడుం వాలేందుకు లేదు - ఇంట్లో వుండటానికి శాంతి, బయటికి పోయేందుకు ధైర్యం లేదు. బ్రతుకులు పరుచుకునేందుకు వీలులేదు. చుట్టి ఒక మూల పెట్టడానికి వీల్లేదు" అని ఒక గృహస్తు ఎంతో అటమటించాడు.

అన్నిటికన్నా తమాషా ఏమిటంటే కంట్రోళ్ళు పెట్టి వస్తువుల్ని సరసమైన ధరలకు విక్రయిద్దామని ప్రభుత్వం తలపెట్టిన తక్షణమే ఆయా వస్తువులు బజారులో అంతవరకూ చిందులు తొక్కే వస్తువులు ఒక్కసారిగా సిగ్గుపడి ఏ చీకటి కొట్లోనో బందై వూరుకుంటాయి.

ఈ అన్నిటి మాటా అలా వుంచి - ఈరోజుల్లో ముఖ్యంగా ఆపేక్షలు, అనురాగాలూ బంద్ అయినాయి. ధరలు పెరిగిన తర్వాత సంసారాల్లో సరసాలే బంద్ అయినాయి. ఏ దంపతుల్లో చూచినా చిలిపితనం, చిరునవ్వు కనిపించడంలేదు. హృదయం బంద్, పెదవులు బంద్.

బంద్ - బంద్ ఎక్కడ చూచినా బందులే ఎక్కువ వున్నాయి. మానవుడు ఆశలు బంద్ చేసుకుని బ్రతకవలసిందేగాని వేరు మార్గం కనిపించడంలేదు.

Post your comments